గ్రామాల్లో విభేదాలు ఉండొద్దు


మాట్లాడుతున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

నవతెలంగాణ-నిజాంసాగర్

గ్రామీణ స్థాయిలో కులవర్గ విభేదాలు లేకుండా ప్రజలందరూ అన్నతమ్ముల్ల వలే కలిసి ఉండాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ అంజయ్య తెలిపారు. గురువారం మండలంలోని మంగుళూరు గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులం పేరుతో గాని వర్గం పేరుతో గాని ఎవరైనా దూషిస్తున్నారా? అని గ్రామస్తులను అడిగి ఆయన తెలుసుకున్నారు. అలాంటి వాటికి పాల్పడితే ప్రభుత్వం చట్టరీత్యా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాజేశ్వర్, సంక్షేమ శాఖ అధికారి జోషి కిషోర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు

- కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని (మార్చ్ 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు) జిల్లా కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధు శర్మ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించవద్దని పేర్కొన్నారు. ప్రజాధనాన్ని నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టవద్దని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తమకు ఈ విషయంలో సహకరించాలని పేర్కొన్నారు.

అధికారుల కోసం పడిగాపులే..

- సమయానికి ఉండని రెవెన్యూ అధికారులు
- నిరాశతో వెనుదిరుగుతున్న ప్రజలు


తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చిన ప్రజలు

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు వారి పనుల నిమిత్తం రెవిన్యూ అధికారుల కోసం బోధన్ రెవెన్యూ కార్యాలయానికి వస్తుంటారు. దూర గ్రామాల నుంచి అధికారుల కోసం ఎన్నో ఆశలతో వచ్చిన వారికి రెవెన్యూ కార్యాలయంలో ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. దాంతో వారు రెవెన్యూ శాఖలోని కిందిస్థాయి ఉద్యోగులకు దరఖాస్తు ఫారాలను ఇచ్చి వెళుతున్నారు. వారి సమస్య నేరుగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు చెప్పుకుందామంటే అందుబాటులో ఎవరూ ఉండటం లేదు. ఉదయం మాత్రమే వారు కార్యాలయానికి వచ్చినట్లే వచ్చి వెళ్లిపోతారని ఎప్పుడు వస్తారో ఎప్పుడు రారో ఎవరికీ తెలవదని అక్కడి వారు చెప్పడం గమనార్హం.

అధికారుల కోసం వచ్చిన ప్రజలు రోజంతా వారికోసం పడిగాపులు పడుతున్నారు. కనీసం అధికారుల కోసం వచ్చిన వారికి తాగడానికి మంచినీటి సౌకర్యం కూడా అధికారులు కల్పించలేకపోతున్నారు. ప్రభుత్వం వారంలో రెండు రోజులు ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వడంతో ఓ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రోజంతా ఇసుక క్వారీ వద్దనే విధులు నిర్వహిస్తున్నారు. ఇసుక క్వారీపై ఉన్న చిత్తశుద్ధి కార్యాలయం పనులపై కేటాయించకపోవడంపై ఆయనపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కనీసం ఎవరైనా ఫోన్ చేసినా ఆయన లిఫ్ట్ చేయరనే విమర్శలు వస్తున్నాయి. ఇసుక, మొరం అనుమతుల ముసుగులో అక్రమాలకు పాల్పడుతున్నట్లు తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కలెక్టర్ ఇప్పటికైనా స్పందించి సమయపాలన పాటించని రెవెన్యూ సిబ్బంది పనితీరుపై వారి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని బోధన్ మండల వాసులు కోరుతున్నారు.

మట్టెలు చేయించుకునేందుకు వెళ్లి..

శవమై తేలి..


కాలువలో లభ్యమైన పద్మ మృతదేహం

- మొన్న అదృశ్యమై నిన్న శవమై
- నిజాంసాగర్ కాలువలో వివాహిత మృతదేహం
- భర్తపై అనుమానముందని మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు


(ఫైల్)

నవతెలంగాణ-నిజాంసాగర్

మట్టెలు చేయించుకునేందుకు వెళ్లిన వివాహిత మొన్న అదృశ్యమై నిన్న శవమై తేలింది. నిజాంసాగర్ కాలువలో వివాహిత మృతదేహం లభ్యమవడంతో భర్తపై అనుమానముందని మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ మండలం తడ్కొల్ గ్రామానికి చెందిన అందోల్ శిరీష అలియాస్ పద్మ (25)ను మూడేండ్ల కిందట ఎల్లారెడ్డి మండలం గండిమాసానిపేట్‌కు చెందిన అందోల్ సతీష్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి సంవత్సరం బాబు యోగేష్ ఉన్నాడు. బుధవారం గండిమాసానిపేట్ నుంచి శిరీష మెట్టెలు చేయించుకునేందుకు తమ తల్లిగారింటికి బయలుదేరగా.. భర్త సతీష్ ఎల్లారెడ్డి వద్ద బస్సు ఎక్కించి ఇంటికి వెళ్ళాడు. శిరీష బాన్సువాడలో బస్సు దిగాల్సి ఉండగా.. నిజాంసాగర్ మండలంలోని గాలిపూర్ గేటు వద్ద తన ఏడాది కుమారుడు యోగేష్‌ను రోడ్డుపై వదిలేసింది. అనంతరం ఆమె సైతం అదృశ్యమైంది.

కాగా అదృశ్యమైన ఆ వివాహిత గురువారం నిజాంసాగర్ కాలువలో శవమై తేలడం కలకలం రేపింది. భర్త సతీష్ మీద అనుమానం ఉందని మృతురాలి కుటుంబ సభ్యులు తెలపడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్..

అభినందనీయం

- మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ ప్రసన్న


టాలెంట్‌టెస్ట్ ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా చొరవ చూపి టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయమని డాక్టర్ ప్రసన్న కితాబిచ్చారు. విద్యార్థులలో మనోధైర్యం కోల్పోకుండా, బోర్డ్ ఎగ్జామ్స్ రాసే విద్యార్థుల భయాన్ని పోగొట్టే ఆలోచన చేయడం ఎస్ఎఫ్ఐ క్రమశిక్షణకు నిలువుటద్దమని పొగిడారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని విక్టరీ, వందేమాతరం, విద్యా, వివేకానంద పాఠశాలలో పది విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాము చదువుతున్న కాలం నుండి ఎస్ఎఫ్ఐ పోరాటాలే కాకుండా ఇలాంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులు చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి 10/10 గ్రేడ్ సాధించాలనే పట్టుదలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. చదువు అన్నింటికీ మార్గమని వివరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విఘ్నేష్ మాట్లాడుతూ.. పోరాటాలే కాకుండా విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ అని తెలిపారు. మండల కేంద్రంలో దాదాపుగా 300 మంది విద్యార్థులు టాలెంట్ టెస్ట్‌లో పాల్గొంటున్నారని అన్నారు. ఈ ప్రతిభ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల యాజమాన్యం, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సంధ్యరెడ్డి, తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షులు ప్రసాద్, నాయకులు దినేశ్, చిత్రు, పవన్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా రెండోరోజు ఇంటర్ పరీక్షలు

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. జనరల్ పరీక్షలకు 7375 మంది విద్యార్థులకు గానూ 7190 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. 185 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. గురువారం ద్వితీయ సంవత్సరం తెలుగు, సాంస్కృతిక, జీఎఫ్ సి-2 పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఒకేషనల్ కొరకు సంబంధించి 1037 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా 1012 మంది విద్యార్థులు హాజరై 25 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 37 సెంటర్ల నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం జనరల్ ఒకేషనల్ కోర్సులకు సంబంధించి పరీక్షలకు 8412 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 8202 విద్యార్థులు హాజరై 210 మంది విద్యార్థులు గైరాజరైనట్టు తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన సిడిపిఓ జానకి


పలువురిని సన్మానిస్తున్న సీడీపీవో

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సిడిపిఓ జానకి గురువారం సందర్శించారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు ఎత్తు బరువులను కొలిచి వారికి పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్వాడీ కార్యకర్తలను ఆదేశించారు. చిన్నారుల సర్వే యాప్‌లపై అవగాహన కల్పించారు. బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేయాలని ఆమె కార్యకర్తలకు సూచించారు. పోషణ యాకర్ యాపుల్లో 100శాతం పూర్తిచేసిన అంగన్వాడీ కార్యకర్తలను గుర్తించి వారిని సన్మానించారు. అంబేద్కర్‌నగర్ గ్రామానికి చెందిన కార్యకర్త పూజ, నీల అంగన్వాడి కార్యకర్త రాజ్యశ్రీ, కందకుర్తి అంగన్వాడీ ఆయా జయశీలను ఘనంగా సన్మానించారు. అనంతరం మార్చి 3 నుంచి నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ వినయ్ కుమార్ వైద్య సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి, ఆరోగ్య విసిన్ అధికారి రవీందర్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- డ్రైవర్ పరిస్థితి విషమం.. పదిమందికి గాయాలు


ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


గాయపడిన వ్యక్తి తరలింపు

నవతెలంగాణ-భిక్కనూర్

వాటర్ ట్యాంకర్‌ను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే పదిమంది ప్రయాణికులకు సైతం గాయాలయ్యాయి. ఈ ఘటన భిక్కనూర్ మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జీఎంఆర్ సంస్థకు సంబంధించిన వాటర్ ట్యాంకర్ 44వ జాతీయ రహదారి డివైడర్ మధ్యలో ఉన్న మొక్కలకు సూచిక బోర్డులను ఏర్పాటు చేసుకొని నీళ్ల పోస్తుండగా.. హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వాటర్ ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో ఆర్టీసీ బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయ్యింది. డ్రైవర్ గోపాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయాలైన ప్రయాణికులను ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు, వాటర్ ట్యాంకును జాతీయ రహదారి నుంచి పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఆర్టీసీ డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా నడపడం కారణంగా ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చేపల పెంపకం.. రైతులకు లాభదాయకం

- కలెక్టర్ జితేష్ వి పాటిల్


చేపల పెంపకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-రామారెడ్డి

మహిళా రైతులు చేపల పెంపకాన్ని చేపట్టి లాభాలు పొందాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. గురువారం మండలంలోని పోసానిపేటలో చేపల పెంపకాన్ని మహిళా సంఘాలతో కలిసి పరిశీలించారు. మహిళా సంఘం సభ్యురాలు, చేపల పెంపకం దారు లక్ష్మిని పెంపకంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళా రైతులు లక్ష్మిని ఆదర్శంగా తీసుకొని, చేపల పెంపకాన్ని చేపట్టాలని సూచించారు.

కార్యక్రమంలో డిఆర్డిఓ పిడి చందర్, డిపిఎం రమేష్ బాబు, ఏపిఎం ప్రసన్న కుమార్, మహిళా సంఘాల సభ్యులు, సీసీలు భూమాగౌడ్, దుర్గాదాస్, శ్రీనివాస్, ప్రతాప్, రైతులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కాలయాపన కోసమే కాంగ్రెస్ కేబినెట్ కమిటీ

- ఎంపీ ధర్మపురి అర్వింద్


మాట్లాడుతున్న ఎంపీ అరవింద్

నవతెలంగాణ-బోధన్

బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యాక్టరీ పునరుద్దరణపై వేసిన క్యాబినెట్ కమిటీ కార్మికులను, రైతులను మోసం చేయడానికి కాలయాపన చేయడం తప్ప దానితో ఒరిగేదేం లేదని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. గురువారం బోధన్ పట్టణంలోని నిజాంషుగర్ ఫ్యాక్టరీ వద్ద ఆయన రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గతంలో వైఎస్ హయాంలో ఏర్పాటు చేసిన కమిటీ ఇచ్చిన రిపోర్ట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వమే బుట్టదాఖలు చేసిందన్నారు. కాంగ్రెస్ డబ్బు, కుల రాజకీయాలు చేస్తుందని, నోటికొచ్చిన వాగ్దానాలు చేస్తూ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. షుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధి, పునరుద్ధరణ కేవలం బీజేపీతోనే సాధ్యమని తెలిపారు. మోడీ ప్రభుత్వం దేశంలో వివిధ రాష్ట్రాలలో గల 66 చెరుకు ఫ్యాక్టరీలను పునరుద్ధరణ చేసిందని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే చెరుకు ఫ్యాక్టరీల పునరుద్ధరణ కొరకు రూ.9005 కోట్లతో అభివృద్ధి చేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బోధన్ షుగర్ ఫ్యాక్టరీ పునరుద్దరణకు సిద్ధంగా ఉందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మంచి స్నేహితులని, ఇద్దరు కలిసి కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను నిర్ణయిస్తారని ఆరోపించారు. షుగర్ ఫ్యాక్టరీని ప్రైవేట్ వ్యక్తులకు విక్రయిస్తే దానిని కొనుగోలు చేసి ఫ్యాక్టరీని నడిపించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఫ్యాక్టరీ రియల్ ఎస్టేట్ విలువ 500 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు.

పసుపు ధరను రూ.4500 నుంచి 14,500 వరకు తీసుకొచ్చిన కేంద్రం పసుపు బోర్డ్ ఎక్కడ పెడతారోనని కాంగ్రెస్ పార్టీ పనికిరాని రాజకీయాలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పసుపు రైతుల మాదిరి చెరుకు రైతులు ఉద్యమించాలని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నామినేషన్లు వెయ్యాలని పిలుపునిచ్చారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇస్తే బోధన్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని హామీనిచ్చారు. సమావేశంలో బీజేపీ నాయకులు పల్లె గంగారెడ్డి, సుధాకర్‌చారి, కౌన్సిలర్ వినోద్, పట్టణ అధ్యక్షులు బాలరాజ్, నియోజకవర్గం ఇంచార్జి శ్రీధర్, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీ వేదలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు


ప్రదర్శనలను వివరిస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని శ్రీ వేద పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కోటగిరి తహసీల్దార్ సునీత సైన్స్ ఫెయిర్ వేడుకలను ప్రారంభించి, విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలను తిలకించారు. విద్యార్థుల రూపొందించిన డయాలసిస్ కిడ్నీ పని చేయువిధానం, ఊపిరితిత్తుల పనిచేయు విధానం, మానవ నాడీవ్యవస్థ, మానవ అవయవాలు, వాటి పనివిధానం, వ్యవసాయంలో పాత కొత్త తరహా పద్ధతులు, చంద్రయాన్ ప్రయోగం, సీతాకోకచిలుక పరివర్తన విధానం, ఆమ్ల వర్షాలు, సమాజంలో వృత్తులు వాటి జీవన విధానాలు, భూమిని ఎలా కాపాడుకోవడం, పప్పు దినుసులు వాటి ఉత్పత్తులు, వాల్యనీస్ తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలు.. వాటి ప్రాముఖ్యత, జై జవాన్ జై కిసాన్, అష్టాదశ శక్తి పీఠాలు, అష్టాదశ పురాణాలు, విలువలు, చిహ్నం, అశోక చక్రం, నీతి కథలు, తెలుగు సంవత్సరాలు, జ్యోతిర్లింగాలు వాటి ప్రాముఖ్యతను విద్యార్థులు తమ ప్రదర్శనను ఏర్పాటు చేసి వివరించారు. వాటిని తిలకించిన తహసీల్దార్ సునీత విద్యార్థులను అభినందించారు. గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి కార్యక్రమాలను పాఠశాలలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సైన్స్ పట్ల విద్యార్థులలో అవగాహన పెంచడం కోసం చేస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. చదువుతోపాటు విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సయ్యద్ హుస్సేన్, పాఠశాల డైరెక్టర్ తేల రవికుమార్, ప్రిన్సిపాల్ తెల్ల అక్షర, ఉపాధ్యాయ బృందం నిర్మల, షామిలి రేష్మ, సాయిపవన్, సాయినాథ్, నాగరాజు, రమేష్, భీమ్‌రావు, చంద్రకళ, సంగీత, అను, సుప్రియ, సంగీత, ప్రవళిక, శ్రీలత, నిషిత, కావ్య, శిరీష, నవనీత, తబాసం, పూజ మీనా తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రానికి చెందిన పిట్టల రమేష్ గురువారం ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ ముఖ్య నాయకులు బుద్దె రాజేశ్వర్ అంత్యక్రియల కోసం రూ.5వేలు మృతుని కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన పిట్టల రమేష్ మృతి చెందడం తనను కలచి వేసిందని అన్నారు. దాంతో మృతిని అంత్యక్రియలు జరపడానికి తన వంతుగా ఐదు వేల రూపాయలను అందించి ఆదుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం మృతుని పార్థివ దేవానికి నివాళులర్పించారు.


ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దళితబంధులో పర్సంటేజీలు తీసుకున్న నీవు దళితుడివేనా..?

- ప్రజల సమక్షంలో అవినీతి అక్రమాలపై నీవు సిద్ధమేనా?
- ఆరు నెలల్లో అవినీతి అక్రమాలపై జైల్లో పెడతా
- మాజీ ఎమ్మెల్యే షిండేకు ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సవాల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నవతెలంగాణ-మద్నూర్

'దళిత బంధులో దళితుల వద్ద పర్సంటేజీలు తీసుకున్న నీవు దళితుడివేనా..?, నిజాంసాగర్ మండలంలో దళితుల వద్ద భారీ మొత్తంలో కమీషన్లు దండుకున్నోడివి నీవు అసలు దళితునివేనా?, నీ అవినీతి అక్రమాలపై ప్రజా తీర్పునకు సిద్ధంగా ఉన్నావా?.. అయితే రా.. నిజాంసాగర్‌లో కూర్చుందాం, దళిత బంధుపై పరిశీలిద్దాం.' అంటూ ఎమ్మెల్యే తోటా లక్ష్మీ కాంతారావు మాజీ ఎమ్మెల్యే హనుమంత్‌షిండేకు సవాల్ విసిరారు. అవినీతి అక్రమాలపై ఆరు నెలల్లో జైల్లో పెట్టడం ఖాయమని హెచ్చరించారు. గురువారం మండలంలోని షేకాపూర్ గ్రామంలో దళిత దండోరా నియోజకవర్గస్థాయి సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా విద్యా, వైద్యం, ఉపాధి ఈ మూడింటిపై ప్రత్యేక దృష్టి సాధిస్తున్నట్లు తెలిపారు. మాదిగ జాతికి అన్ని రంగాల్లో న్యాయం కోసం ఎంతవరకైనా పోరాడుతానని వివరించారు. ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కత నిశ్చయంతో ఉన్నారని దానికోసం ఎమ్మెల్యేగా పోరాటం చేస్తానని తెలిపారు. 15 సంవత్సరాల కాలంగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన హనుమంతుషిండే ప్రజల సమస్యలు పట్టించుకోలేదని, అవినీతి అక్రమాలకు పాల్పడుతూ ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. ఆయన చేసిన అవినీతి అక్రమాల చిట్టా బయటపెట్టే రోజులు దగ్గరపడ్డాయని, ఆయనను జైల్లో పెట్టడం ఖాయమని సభాముఖంగా తెలిపారు. మాదిగ జాతి ప్రతి ఒక్కరూ ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అండగా ఉంటానని హామీనిచ్చారు. మాదిగ జాతి అన్ని రంగాల్లో ఎదగటానికి తన వంతు సహాయ సహకారాలు కృషి ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో జుక్కల్ నియోజకవర్గంలోని మాదిగ జాతి ప్రజా ప్రతినిధులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కులపెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మాజీ వార్డ్ మెంబర్ ఆత్మహత్య


కవిత (ఫైల్)

నవతెలంగాణ-రామారెడ్డి

ఆర్థిక ఇబ్బందులతో మాజీ వార్డ్ మెంబర్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చింతకుంట కవిత (36), గత 18 సంవత్సరాల క్రితం చింతకుంట కిషన్‌తో వివాహమైంది. ఎలాంటి ఆస్తులు లేకపోవడంతో పాటు, అనారోగ్యం కారణంగా అప్పులు అయ్యాయి. డ్వాక్రా గ్రూప్ రుణాలలో రూ.2లక్షల 50వేలు అప్పు తీసుకొని, ఆర్థిక ఇబ్బందులతో గత 7 నెలల నుంచి అప్పు చెల్లించకపోవడంతో గురువారం ఉదయం అప్పు చెల్లించాలని బ్యాంకు సిబ్బంది, మహిళా సంఘం సభ్యులు ఇంటికి వెళ్లి అప్పు కట్టాలని చెప్పి వెళ్లిపోగా.. భర్త కిషన్ ఇంటి నుంచి డబ్బుల కోసం బయటకు వెళ్లాడు. మనస్థాపానికి గురైన కవిత ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుమారుడు గమనించి తీసివేసి, తండ్రికి సమాచారం అందించడంతో, చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మరణించిందని వైద్యులు నిర్ధారించారని భర్త కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో శవానికి పోస్టుమార్టం నిర్వహించారు.

పిల్లలను ఇటుక బట్టీలో పనిచేయిస్తే కఠిన చర్యలు

- డీసీపీవో స్రవంతి


మాట్లాడుతున్న డీసీపీవో స్రవంతి

నవతెలంగాణ-రామారెడ్డి

బడీడు పిల్లలను ఇటుక బట్టీల్లో పనిచేయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని డిసిపిఓ స్రవంతి ఇటుక బట్టి యజమానులకు సూచించారు. గురువారం మండలంలోని ఉప్పల్‌వాయి ఆవాస ప్రాంత పాఠశాలను కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేశారు. ఐదు సంవత్సరాల పైబడిన పిల్లలు తప్పకుండా పాఠశాలకు రావాలని, ఐదు సంవత్సరాలలోపు పిల్లలు అంగన్వాడి నుంచి పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూర్య ప్రకాష్, సిఆర్‌పి మహమ్మద్, వివి వెంకటేష్, దినేష్ తదితరులున్నారు.

విద్యార్థుల ఆలోచనలే వారి శ్రమకు గుర్తింపు


వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థుల ఆలోచనలే వారి శ్రమకు గుర్తింపు అని పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తాలోగల ప్రజ్ఞ ఐఐటీ పాఠశాల ప్రిన్సిపాల్ రోమా వంశీ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్నారుల వైజ్ఞానిక ప్రదర్శనలు ఆలోచింప చేశాయని తెలిపారు. చిన్ననాటి నుండే కష్టపడి చదువుతూ తల్లిదండ్రులకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పేరు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు..

అపురూప ఆలయంలో భారతి నృత్యానికేతన్ చిన్నారుల నృత్య ప్రదర్శన


ప్రదర్శనలో భారతి నృత్యానికేతన్ చిన్నారులు

నవతెలంగాణ-ఆర్మూర్

అపురూప వెంకటేశ్వర స్వామి పుష్కర బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద గల భారతీ నృత్యానికేతన్ విద్యార్థులతో ప్రత్యేక నృత్య ప్రదర్శన చేయించినట్టు నాట్య గురువు సరోజ సుధీర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మమ్మల్ని ఆహ్వానించిన దేవస్థానం కమిటీ వారికి విజయ్ విద్యాసంస్థల అభినేత్రి అమృతలతకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

బైపాస్‌లో కారు చీకట్లో ప్రయాణం

- రోడ్డువిస్తరణ పనులతో తప్పవని ఇబ్బందులు
- ప్రమాదాలకు ఆస్కారంగా మారిన వైనం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మాధవ నగర్ సాయిబాబా మందిరం దగ్గర రైల్వే గేట్ నుండి నిత్యం 100 రైళ్ల కు పైగా పోవడం వల్ల వాహనదారులకు ఇబ్బందిని గ్రహించి గత ప్రభుత్వంలో రైల్వే బ్రిడ్జి పనులు చేపట్టారు. సుమారుగా ఆ బ్రిడ్జ్ ఫ్లైఓవర్ పూర్తికావడానికి 7 నుంచి 8 నెలలు పట్టవచ్చని ఆర్అండ్‌బి, రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే శాఖ పనులు పూర్తి అయ్యాక మిగతా పని ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ పూర్తి చేస్తారని అందుబాటులో ఉన్న ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ తెలిపారు. మాధవ నగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి మలుపు దగ్గర నుండి నిజామాబాద్ పట్టణానికి నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. రాత్రిపూట చాలా చీకటిగా ఉంటుంది. లైట్లు లేకపోవడం వల్ల చాలా ఇబ్బందిగా ఉందని వాహనదారులు అంటున్నారు.

అక్కడి నుండి నిజామాబాద్ పట్టణానికి రిలయన్స్ కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా వరకు కూడా చిమ్మని చీకట్లో వాహనాలు వెళ్లే పరిస్థితి ఉందని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డు విస్తరణ పనులు జరిగినప్పటికీ డివైడర్లు మాత్రం ఇంకా పూర్తి కాలేదు దాని వల్ల రాత్రి పూట ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అంటున్నారు. అలాగే రోడ్డు డివైడర్ పనులు చేయాలని మరియు కరెంటు స్తంభాలు కూడా ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. రిలయన్స్ స్మార్ట్ కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు దగ్గర చిన్న బ్రిడ్జ్ పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయని అన్నారు. దానిపైన బీటీ రోడ్డు వేయాలని తెలిపారు.

ఈ రోడ్డు విస్తరణ పనులకు బ్రిడ్జికి సుమారుగా 18 కోట్ల వరకు ఆ శాంక్షన్ అయిందని అలాగే వర్ని రోడ్లో కూడా రోడ్డు విస్తరణ పనులను లకు 8 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పూర్తి చేస్తామని ఆర్అండ్‌బి శాఖ వారు చెబుతున్నారు. ఈ రోడ్డు డివైడర్ పనులు గాని వీధిలైట్లకు గాని నుడా సహకారం కావాలన్నారు. ప్రభుత్వం మారడం వల్ల కొంచెం పనుల్లో జాప్యం జరిగినప్పటికీ నుడా సహకా రంతో డివైడర్లు, వీధి స్తంభాలు అన్నీ కూడా త్వరలో పూర్తి కావచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. అప్పుడు వాహనదారు ల కష్టాలు తీరుతాయని అందరు ఆశతో ఎదురుచూస్తున్నారు.


కంఠేశ్వర్‌లోని బైపాస్‌రోడ్డు.. (ఇన్‌సెట్లో మాధవ్‌నగర్ వద్ద కొనసాగుతున్న బ్రిడ్జీ పనులు)

శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహా కుంభాభిషేకం

- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల


బిగాల గణేష్‌గుప్తకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయకమిటీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆల యంలో మహా కుంభాభిషేకం పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తాతోపాటు మేయర్ దండు నీతూ కిరణ్ గురువారం పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ భక్త మార్కండేయ సహిత శివపంచాయతన నవగ్రహ దేవాలయ త్రితల రాజగోపుర కలశ జీవధ్వజ ప్రాణప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షులు సిర్ప రాజు, సత్యప్రకాశ్, సూదం రవిచందర్, దండు చంద్రశేఖర్, ముచ్కూర్ నవీన్, తడ్కల్ శ్రీను, పాల్తి రవి కుమార్, కొవూరి జగన్, చిదురా శ్రీనివాస్, కసుబ సంపత్, గర్పల్లి ప్రవీణ్, పద్మశాలి సంఘం నగర అధ్యక్షులు నర్సయ్య, సెక్రటరీ ఎనగందుల మురళి, కార్పొరేటర్ ధర్మపురి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

మండల అధికారుల విధులు తెలుసుకున్న ట్రైనీ ఐఏఎస్


కంపోస్ట్‌షెడ్‌ను పరిశీలిస్తున్న ట్రైనీ ఐఏఎస్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మునిపల్లి గ్రామాన్ని ట్రైనీ ఐఏఎస్ కిరణ్మయి గురువారం సందర్శించి మండల స్థాయి అధికారుల విధి విధానాలు తెలుసుకున్నారు. ఎంపీడీవో, ఎం పీఓ, ఏపీవో, ఏపీఎం వీరు చేస్తున్న పని ఏమిటి, అభివృద్ధి ఏ విధంగా జరుగుతుందో తెలుసుకున్నారు. గ్రామంలో గల నర్సరీని, గ్రామపంచాయతీ రికార్డ్స్, డంపింగ్ యార్డ్స్, పల్లె ప్రకృతి వనం, సందర్శించారు. ఎండిఓ సతీష్ కుమార్, డిఎల్‌డిఓ శివ కృష్ణ, ఎంపీవో యూసఫ్ ఖాన్,ఏపీవో రవి, ఏపిఎం రవీందర్ రెడ్డి, పంచా యతి సెక్రటరీ గౌతమి, మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అపురూపలో బ్రహ్మోత్సవాలు ముగింపు


అన్నదానంలో పాల్గొన్న భక్తులు



నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మామిడపల్లి గ్రామ శివారులోని 63వ జాతీయ రహదారి ప్రక్కన గల అపురూప వెంక టేశ్వర ఆలయంలో సప్తాహ్ని క పుష్కర బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయ అవరణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్ అమృత లత, కమిటీ సభ్యులు రమాదేవి, ప్రభదేవి, రమణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఆర్‌ఐకి సత్కారం

నవతెలంగాణ-నవీపేట్

బదిలీపై వెళ్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మోహన్‌కు తహసిల్దార్ నారాయణ, రెవెన్యూ సిబ్బంది గురువారం శాలువా,పూల బొకేలతో ఘనంగా సత్కరించారు. మూడు సంవత్సరాలుగా మండల ప్రజలకు రెవెన్యూ సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా కృషి చేశారని తెలిపారు. రెవెన్యూ సిబ్బందితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు సన్మానించి వీడ్కోలు పలికారు. పెద్ద మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనకు సహకరించిన సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆర్ఐ మోహన్ ఇందల్వాయి మండలానికి బదిలీ కాగా ఇందల్వాయి ఆర్ఐ నవీపేట్‌లో పదవి బాధ్యతలు చేపట్టనున్నారు.


ఆర్‌ఐతో సిబ్బంది

సైన్సు ప్రాజెక్టులు ఏర్పాటుచేయడం అభినందనీయం

- దివ్యాంగుల పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రికన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నిజామాబాద్‌నగరంలోని మారుతి నగర్‌లోని దివ్యాంగుల పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు హాజరై మాట్లాడుతూ.. సర్ సివి రామన్ కనిపెట్టిన రామన్ ఎఫెక్ట్ వల్ల ఆయన నోబుల్ బహుమతి పొందారని తెలిపారు. భారతదేశంలోని శాస్త్రవేత్తలు తమ ఆవిష్కరణలను దేశ ప్రజల ఉపయోగార్థం చేపట్టినట్లయితే భారతదేశానికి మేలు కలుగుతుందని అన్నారు. దివ్యాంగులు సైన్సు ప్రాజెక్టులను చేపట్టి వివిధ అంశాలలో ప్రయోగాత్మకంగా వివరించడం అభినందనీయమని అన్నారు. అంద విద్యార్థులు నీటి శుద్ధికరణ ప్రయోగము, విత్తనాలు మొలకైతే విధానం యొక్క ప్రయోగం, గ్రహణాలు ఏర్పడే విధానం, గాలి ద్వారా విద్యుత్తును తయారు చేసుకునే విధానం అభినందనీయమని తెలిపారు. దీనికి గౌరవ అతిథిగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి రసూల్ బి హాజరై మాట్లాడుతూ తన కెరీర్‌లో స్నేహ సొసైటీ దివ్యంగుల పాఠశాల విద్యార్థులు చేసిన సైన్సు ప్రయోగాలు ఎక్కడ చూడలేనని తెలిపారు. 100మంది విద్యార్థులు సైన్స్ ప్రయోగాలు చేయడమే కాకుండా వాటి గురించి వివరించడం నిజంగా అభినందనీయమని తెలిపారు. మరో గౌరవ అతిథిగా జిల్లా సైన్స్ అధికారి గంగా కిషన్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ విజ్ఞానాన్ని సాంకేతికతను నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడమే జాతీయ సైన్స్ యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు. సివి రామన్ చేసిన ప్రయోగాలను ఉపయోగించుకొని కొత్త ప్రయోగాలను చేయాలని సూచించారు. జాతీయ అవార్డు మహిళా విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు నర్ర రామారావు రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీత డి. విజయానంద రావు జాతీయ సైన్స్ దినోత్సవం ప్రాధాన్యతను తెలిపారు. క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి యస్. సిద్దయ్య, ప్రిన్సిపాల్ యస్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.


సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న ప్రముఖులు

టియు అవినీతిపై ప్రభుత్వం విచారణ చేపట్టాలి


మాట్లాడుతున్న పీడీఎస్‌యు నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ యూనివర్సిటీ (టియు) విద్యార్థుల మెస్ బకాయిలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యూ) నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లి ఎన్ఆర్ భవన్ ఆఫీసులో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం. నరేందర్, డాక్టర్ కర్క గణేష్ మాట్లాడుతూ...

తెలంగాణ రాష్ట్రం పేరుతో ఏర్పడ్డ తెలంగాణ యూనివర్సిటీలోని అధికారులు పేద విద్యార్థుల తిండిని సైతం మెక్కడం దారుణమన్నారు. మెస్ బకాయిలో అవినీతి జరిగిందని విచారణ చేపట్టాలని కోరితే రిజిస్టర్ ప్రొఫెసర్ యాదగిరి, అధికారులు సైతం ఉద్యమాన్ని నీరుగాడ్చే విధంగా చేయడం దారునమన్నారు. ఇప్పటికే మెస్ డిపాజిట్ల ద్వారా విద్యార్థుల మీద భారం మోపి, మరలా బకాయిలో జరిగిన అవినీతితో భారం మోపడం అనేది పేద విద్యార్థులను చదువుకు దూరం చేయడంలో భాగమేనన్నారు. నోటీస్ బోర్డ్ మీద మెస్ చార్జీలు ఒక విధంగా అధికారుల రికార్డుల్లో ఒక విధంగా చూపడం అనేది విద్యార్థులను ఆర్థిక దోపిడీకి గురి చేయడమన్నారు. యూనివర్సిటీలో జరుగుతున్న అవినీతికి, అక్రమ నియమకాలకు రిజిస్టర్ ప్రొఫెసర్ యాదగిరి వత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ యూనివర్సిటీ అవినీతికి, పైరవీకారులకు అడ్డాగా మారిందన్నారు. ఇకనైనా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలంగాణ యూనివర్సిటీ మీద ప్రత్యేక దృష్టి పెట్టి అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని కోరారు. తెలంగాణ యూనివర్సిటీకి 500 కోట్లు కేటాయించి యూనివర్సిటీ అభివృద్ధికి పాటుపడాల్సిందిగా కోరారు. యూనివర్సిటీలో అకాడమిక్ వాతావరణాన్ని పెంపొందించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే అఫ్సర్, కోశాధికారి అనిల్, నాయకులు వర్ధన్, చరణ్, సుమన్ పాల్గొన్నారు.

సక్సెస్ కావాలంటే పాఠశాల విద్యకీలకం

- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి
- రోడ్లు భవనాలు చీఫ్ ఇంజనీర్ మోహన్ నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రతిరోజు కొత్తదానాన్ని నేర్చుకోవాలని, జీవితంలో సక్సెస్ కావాలంటే పాఠశాల విద్య కీలకమని, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, అధికారిగా, క్రీడాకారులుగా, రాజకీయ నాయకులుగా కావడానికి ఒక లక్ష్యంతో ముందుకు పోవాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి, పూర్వ విద్యార్థి జే మోహన్ నాయక్ చీఫ్ ఇంజనీర్-హైదరాబాద్ రోడ్లు భవనాలు అన్నారు. ఖిల్లా డిచ్ పల్లి జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఘనంగా ఫేర్వెల్ పార్టీ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి, ప్రత్యేక అతిథిగా పూర్వ విద్యార్థి జే మోహన్ నాయక్ ఇంజనీర్ చీఫ్ హైదరాబాద్ రోడ్లు భవనాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి మాట్లాడుతూ పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. బాగావచ్చే సబ్జెక్టు కోర్సులను ఎంపిక చేసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందని ఎమ్మెల్యే వివరించారు. ఈ పాఠశలలో చదివి ఉన్నత పదవిలో ఉన్న మోహన్ నాయక్ ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. సైన్స్ పైన టెక్నాలజీ పైన పట్టు సాధించాలని వివరించారు. జే మోహన్ నాయక్ 1985 86 ఎస్ఎస్సి బ్యాచ్ ఇక్కడే చదువుకున్నానని పాఠశాల అభివృద్ధికి లక్ష రూపాయలు ఇచ్చానని, క్రీడా పరికరాలు కొనుగోలు చేయించానని, భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి తనవంతుగా తోడ్పడుతు సహకరిస్తానని తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ ప్రతిరోజు కొత్తది నేర్చుకోవాలని చెప్పారు. ఈ సభకు ప్రధానోపాధ్యాయులు సీతయ్య సభకు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుస సుదర్శన్, ఏజీ దాస్, నూతన సింగిల్విండో చైర్మన్ రాంచందర్ గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ విడిసి సాయిలు, రామాలయ కమిటీ చైర్మన్ శాంతయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అమృత పూర్ గంగాధర్, పోలసాని శ్రీనివాస్, డాక్టర్ శాదుల్లా, కంచెట్టి గంగాధర్, కాంగ్రెస్ నాయకులు, విడిసి సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

బహిరంగ సభను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

(సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా) (పిసిసి సిపిఐ ఎంఎల్) (సిపిఐ ఎంఎల్ అర్ఐ) మూడు విప్లవ పార్టీల ఐక్యత మహాసభ ఈనెల 3 4 5 తేదీల్లో ఖమ్మంలో జరగనుందని, ఈ సభను విజయవంతం చేయాలని సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా జిల్లా కార్యదర్శి వనమల కృష్ణ అన్నారు. గురువారం డిచ్ పల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014 లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నల్లధనాన్ని వెలికి తీసి ప్రజల ఖాతాలో 15 లక్షల రూపాయలు వేస్తామని చెప్పారన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేసి రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ప్రజా కార్మిక రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. దేశంలో ఉన్న ఇతర విప్లవ పార్టీలు ఒకే పార్టీగా ఐక్యం అయ్యేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా డివిజన్ కార్యదర్శి వెంకన్న, సహాయ కార్యదర్శి సాయగౌడ్, మండల కార్యదర్శి మురళి, కిషన్ ,మోహన్, సాయి బాబా తదితరులు పాల్గొన్నారు.

అంకాపూర్ గ్రామాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్


మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్ గ్రామంలో ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి గురువారం వివిధ అంశాలపై క్షేత్రస్థాయి పర్యటన చేశారు. గ్రామపంచాయతీ ఆవరణలో ఐకెపి ఉపాధి హామీ కూలీలతో వారి స్కీములపై ముఖాముఖిగా చర్చించారు. గ్రామంలోని బృహత్ పల్లె ప్రకృతి వనం, నర్సరీని సందర్శించారు. అంతేగాక సీడ్ ప్రాసెసింగ్ ఏ విధంగా జరుగుతుందో తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఎల్పిఓ శివకృష్ణ, ఎంపీడీవో సాయిరాం, ఏపీఎం గంగారం, జక్రాన్పల్లి పీ ఓ ఖాన్, రైతు సంఘం మాజీ కార్యదర్శి కేకే బాజన్న, ఏపీవో సురేష్ పంచాయతీ సెక్రటరీ హారిక పాల్గొన్నారు.

నువ్వుల పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- ఏవో మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-బాల్కొండ

నువ్వుల పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో మహేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నువ్వుల పంటను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఆకుముడుత, గొంగళి పురుగు నువ్వు పంటలో పత్ర హరితాన్ని గీకి తినడం వల్ల ఎదుగుదల ఆగిపోతుందన్నారు. తద్వారా దిగుబడి తగ్గిపోతుందనిచ, నివారణకు ఇమామెక్టిన్ బెంజాయేట్ 100 గ్రాములు లేదా క్లోరాంతర నీలిప్రోలు 60 ఎంఎల్ ఎకరానికి ఏదేని ఒకదానిని రెండు వందల లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలని అన్నారు. రసం పీల్చే పురుగులైన తామర నల్లి పేను ఆకులో అడుగుభాగం నుండి రసం పీల్చడం వల్ల ఆకులు పాలిపోయి ఎదుగుదల లోపిస్తుందన్నారు. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 100 ఎంఎల్ లేదా డైమిథయేట్ 400 ఎంఎల్ లేదా థయోమిథాక్సమ్ 80 గ్రాములు ఏదేని ఒకదానిని రెండు వందల లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేయాలని తెలిపారు. వేరుకుళ్ళు తెగులు నివారణకు కాపరాక్సి క్లోరైడ్ 400 గ్రాములు లేదా మెటలక్సిల్ 500 ఎంఎల్ ఏదైనా ఒక దానిని 200 మీటర్ల నీటిలో కలుపుకొని వేరు మొదలు భూమి తడిచేలా పిచికారీ చేయాలనీ రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రేష్మ, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏవో మహేందర్‌రెడ్డి

శాంతి భద్రతల కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలి

నవతెలంగాణ-దోమకొండ

శాంతి భద్రతల కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ ప్రభాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సుతారి రమేష్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ప్రజలు ఐకమత్యంతో ఉండాలని, శాంతి భద్రతల కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు భూమాగౌడ్, నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై

ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో కామారెడ్డి పట్టణానికి చెందిన మ్యాక్స్ కేర్ హాస్పిటల్ సహకారంతో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు సూర్యకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ చంద్రకాంత్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ భూమిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ పోతిరెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షులు లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వీడీసీ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

విధుల్లో చేరిన ఉపాధ్యాయుడు

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మల్లూరు గ్రామంలోని ప్రైమరీ స్కూల్‌లో లాంగ్ లీవ్‌లో ఉన్న ఉపాధ్యాయుడి పై 'అనుమతి లేదు. సమాచారం ఇవ్వలే' అనే శీర్షికన నవతెలంగాణలో కథనం ప్రచురితమైంది. దీంతో వెంటనే ఉపాధ్యాయుడు స్పందించి విధుల్లో చేరాడు.

కౌలాస్ మహంతేశ్వర మఠం ఉత్తరాధికారిగా నాగేశ్వర్ మన్మథ్ స్వామి



నియామక కార్యక్రమంలో స్వాములు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కౌలాస్ మహంతేశ్వర మఠం సంస్థాన పీఠానికి ఉత్తరాధికారిగా నాగేశ్వర మన్మథ స్వామి నియామకమయ్యారు. గురువారం మఠంలో జరిగిన కార్యక్రమంలో ప్రస్తుత మఠాధిపతి మల్లికార్జున స్వామి మహారాజ్ ఆధ్వర్యంలో నూతన ఉత్తరాధికారి నియామకం చేపట్టారు. కౌలాస్ వృషభలింగ శివాచార్య మఠాధిపతి బసవలింగ శివాచార్య మహారాజ్, హనేగామ్ పీఠాధిపతి శంకర లింగ శివాచార్య మహారాజ్, ఖత్‌గావ్ పీఠాధిపతి మల్లికార్జున శివాచార్య మహారాజ్, గుడిమెట్ మహారాజ్ మహాదేవ స్వామి ఆధ్వర్యంలో ఉత్తరాధికారిగా నియామక ఏర్పాటు చేపట్టారు. కార్యక్రమంలో కౌలాస్ వీరశైవ లింగాయత్ సమాజ్ నాయకులు వీరేశ్ పటేల్, ప్రకాష్ పటేల్, వినయ్ పటేల్, మల్లికార్జున అప్ప, బాబయప్ప, కాశప్ప, బోడ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎంపీడీవోకు సన్మానం



ఎంపీడీవోను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ మండలంలో గత కొన్ని సంవత్సరాలుగా ఎంపీడీవోగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన అనంతరావును మండల నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, ఎంపీఓ ప్రవీణ్ కుమార్, పెద్ద మల్లారెడ్డి సొసైటీ చైర్మన్ రాజాగౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు


నవతెలంగాణ-పిట్లం

మండలంలోని గౌరారం గ్రామంలో రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు చిత్రప టాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన వాగ్దానాల మేరకు ఒక్కొక్కటి అమలు చేస్తున్నారన్నారు. 6 గ్యారెంటీ పథకాలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన వెనువెంటనే రెండు పథకాలను రెండు రోజులలోనే శ్రీకారం చుట్టి మరో 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు విద్యుత్ సరఫరా పథకాలకు అమలు చేయడంతో సామాన్య పేద ప్రజలకు ఊరట లభించిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేష్ గుప్తా, శంకర్, రాజు, సంతోష్, కాషాగౌడ్, రామయ్య, లాలయ్య, సిద్ధప్ప, రాములు, నవీన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-రాజంపేట్

గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజేశం పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శు లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ లో భాగంగా కూలీల సంఖ్యను పెంచాలని, మొక్కలకు నీరు పట్టాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులకు గ్రామపంచాయతీలో సానిటేషన్ సమస్య రాకుండా తాగునీటి సమస్య రాకుండా, 3న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాం, ఏపీవో, టిఏ, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో

సర్పంచ్‌లపై గత ప్రభుత్వం కక్ష

- కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుంది
- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

నవతెలంగాణ-నిజాంసాగర్

గత బీఆర్ఎస్ సర్కార్ సర్పంచ్‌లపై కక్షపూరితంగా వ్యవహరించిందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. గురువారం మండలంలోని జక్కాపూర్ గ్రామంలో నిర్వహించిన విజయోత్సవ సభ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బిచ్కుంద మండలంలోని శాఖపూర్‌లో నిర్వహిస్తున్న ఎస్సీ దండోరా కార్యక్రమంలో పాల్గొనేందుకు వెంటనే తిరుగు ప్రయాణమయ్యారు. అదేవిధంగా మండల నాయకులు మల్లికార్జున్ జక్కాపూర్‌లోని వైకుంఠధామాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మండలంలోని అన్ని గ్రామాలలో పనులన్నీ పూర్తి చేస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ జెడ్పీటీసీ ప్రదీప్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, జక్కాపూర్ మాజీ సర్పంచ్ బంజ కంసవ్వ బస్సప్ప, వడ్డేపల్లి మాజీ సర్పంచ్ సంధ్య పండరి, బుడిమే శ్రీనివాస్, పెద్దీ హనుమాన్లు తదితరులు పాల్గొన్నారు.



వైంకుంఠధామాన్ని ప్రారంభిస్తున్న పలువురు

రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు కృషి చేయాలి

- జాతీయ రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు సోమశేఖర్ రావు

నవతెలంగాణ-బోధన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని జాతీయ రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు సోమశేఖర్‌రావు అన్నారు. గురువారం జాతీయ రైతు సంఘాల సమాఖ్య పిలుపు మేరకు బోధన్ ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట ఆయన ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, ప్రభుత్వాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగులో రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. అందుకై అవసరమైన సబ్సిడీలు, బీమా పథకాలను, యంత్రాలను ప్రభుత్వం రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. పంట నష్టాలు వ్యక్తిగత రైతు యూనిట్లు అంచనా యూనిట్‌గా పరిగణించాలని డిమాండ్ చేశారు. 30రోజులలోపు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంట నష్టశాతాన్ని అంచనా వేయడానికి వ్యవసాయ శాఖ అధికారులు అంచనాలు కమిటీలను నియమించాలని కోరారు. మూతపడిన చక్కెర కర్మాగారాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రైతుల బకాయిలను ప్రభుత్వం చెల్లించాలన్నారు. చెరుకు రవాణాపై గల ఆంక్షలను తొలగించాలని కోరారు. రైతుల వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. జన్యుమార్పిడి విత్తనాల వాడకంపై ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రైతు సహకార సంఘాలకు ఆదాయపు పన్ను రాయితీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. జాతీయస్థాయిలో నిర్ణీత సమయంలో పౌర సేవలు పొందే హక్కు చట్టాన్ని తీసుకురావాలని అన్నారు. నిర్ణీత సమయంలో సేవలు అందించని అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే విధంగా చట్టాలు రూపొందించాల న్నారు.

ఈ కార్యక్రమంలో శివరాజ్ దేశాయి, కొత్తపల్లి విండో అధ్యక్షుడు సునీల్ కుమార్, రైతులు గంగారం, మోతీలాల్, లాలయ్య, షరీఫ్, గోవింద్, మాణిక్యం, సూర్యకాంత్, షహీద్ హుసేన్, మూర్తి, అరుణ్‌కుమార్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న రైతుసంఘాల నాయకులు

బాగా చదివి 10 జీపీఏ సాధించాలి

- ఎంఈవో రామస్వామి

నవతెలంగాణ-రాజంపేట్

విద్యార్థుల బాగా చదివి 10 జీపీఏ సాధించి ప్రభుత్వ పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఎంఈఓ రామస్వామి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలికల పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు విజయ స్ఫూర్తి కార్యక్రమాన్ని హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రామ స్వామి మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని సద్విని యోగం చేసుకుని ఆత్మవిశ్వాసంతో ఉండాలన్నారు. భవిష్య త్‌లో ఉన్నత అవకాశాలుంటాయని, కావున వాటిని సద్విని యోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందించిన గుండారం ఎంపిటిసి హాజీ నాయక్‌కు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధి కృష్ణకర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఏటా పరీక్షలు ఎదుర్కోవడం సహజమని, ఈ క్రమంలో కొందరు ఒత్తిడికి గురవుతుంటారని.. ప్రణాళిక ప్రకారం చదవడంతో పాటుగా చిన్నచిన్న చిట్కాలు పరీక్ష రాసే సమయంలో పాటిస్తే వందశాతం ఫలితాలను సాధించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు కృష్ణారావు, వంశీ, అన్వేష్‌రావు, కృష్ణాకర్‌రావు, ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



అందజేసిన పరీక్ష ప్యాడులతో విద్యార్థులు

పరీక్ష కేంద్రం తనిఖీ

బోధన్ : పట్టణంలోని ప్రభుత్వ మధుమలాంచ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష సందర్భంగా గురువారం ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ అధికారి రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల రికార్డులు, మౌలిక వసతులు పరిశీలించారు. ఆయనతోపాటు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ శివకుమార్ యాదవ్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ వినోద్ కుమార్, కళాశాల ఎగ్జామినేషన్ క్లర్క్, సిబ్బంది రమేష్, బాలయ్య ఉన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం తనిఖీ

వర్ని : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ మోతిసింగ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

రెండోరోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం - అయిదుగురు గైర్హాజరు

మద్నూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూని యర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలలో భాగం గా గురువారం రెండోరోజు ఇంటర్ రెండవ సంవత్సరం మొదటి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షలకు గాను మొత్తం విద్యార్థులు 162 మంది హాజరు కావలసి ఉండగా మొదటి పరీక్షకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరై నట్టు పరీక్ష కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్ గంగాధర్ పేర్కొన్నారు. పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు పాల్ప డకుండా పకడ్బందీ ఏర్పాట్ల మధ్య పరీక్షలు రెండోరోజు ప్రశాంతంగా ముగిసినట్లు ఆయన తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరు

పిట్లం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలలో రెండవ రోజు ముగ్గురు విద్యార్థులు గైరా జరైనట్లు ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్ సబ్బాని నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 287 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా ము గ్గురు విద్యార్థులు గైరాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దు

- వందశాతం ఇంటి పన్నులు వసూలుపై దృష్టిపెట్టాలి
- ఎంపీడీవో శంకర్

నవతెలంగాణ-రెంజల్

గ్రామ కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీడీవో శంకర్ తెలిపారు. గ్రామాల్లో వందశాతం ఇంటి పన్నులు చేపట్టాలని, వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత గ్రామ కార్యదర్శులపై ఉందని పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులకు, క్షేత్ర సహాయకులకు, మేటీలకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. నర్సరీల పెంపకంలో క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతిరోజు నర్సరీలకు నీటిని అదించే విధంగా చూడాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమం లో ఎంపీడీవో శంకర్, ఎంపీఓ గౌస్ మొయి నుద్దీన్, సూపరిం టెండెం ట్ శ్రీనివాస్, ఏపీవో రమణ, ఈసీ శరత్‌చంద్ర, గ్రామ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, పాల్గొ న్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో శంకర్

మద్నూర్‌లో సంతోషిమాత వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-మద్నూర్

ప్రతి సంవత్సరం శివరాత్రి ముందు సంతోషిమాత వార్షికోత్సవం మద్నూర్‌లో నిర్వహిస్తారు. అందులో భాగంగా నేడు శుక్రవారం సంతోషిమాత వార్షికోత్సవ వేడుకలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నట్లు పూజారి సంతోషి తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆలయ ఆవరణంలో గణపతి నవగ్రహాల పూజ, కుంకుమ పూజ, యజ్ఞం ప్రత్యేకంగా నిర్వహించనునట్టు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రోటరీ క్లబ్ ప్రేరణ తరగతులు



మాట్లాడుతున్న రోటరీ అధ్యక్షుడు సత్యం

నవతెలంగాణ-కామారెడ్డి

రోటరీ క్లబ్ ఆధ్వర్యం లో కామారెడ్డి జిల్లా కేంద్రం లోని బాలికల సమీకృత వసతి గృహంలో గురువా రం 10వ తరగతి, 9వ తర గతి విద్యార్థులకు ప్రేరణ తరగతులను నిర్వహించిన ట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు పోలబోయిన సత్యం అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా విద్యను అభ్యసించి, మ నోధైర్యంతో పరీక్షలను రాసి భవిష్యత్తులో ఉన్నతమైన స్థితిలో స్థిరపడాలని, ఉన్నతమైన విలువలతో కూడిన జీవితం గడపాలని విద్యార్థినులకు సూచిం చారు. విద్యార్థులు పరీక్షల పట్ల భయాన్ని పోగొట్టుకోవాలని ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని, ఆత్మస్థైర్యం పట్టుదల కృషి ఉంటే సాధించలేనటువం టిది ఏదీ లేదని, ఎప్పుడు కూడా పరిస్థితులను తట్టుకొని భవిష్యత్తులో మంచి ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రాజనర్సింహారెడ్డి, సభ్యులు గడ్డం గంగారెడ్డి, మోటివేటర్ కోడిపాక సత్యనారాయణ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సరిత, విద్యార్థినులు పాల్గొన్నారు.

డోంగ్లిలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

- తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లిలో జొన్న కొను గోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తహసీల్దార్ రేణుక చౌహాన్‌కు జొన్న రైతులు గురువారం వినతిపత్రాన్ని అందజేశా రు. ఈ సందర్భంగా రైతు లు మాట్లాడుతూ.. ఉమ్మడి మండలంలో 1740 ఎకరాల్లో జొన్న పంట సాగవుతుందని తెలిపారు. దీనికి ప్రభుత్వం రూ.3180 మద్దతు ధర కల్పించిందని, మల్దాండి జొన్న రూ.3225 ధర ఉందని, కావున ఉమ్మడి మండలంలో రెండు వారాలు జొన్న కోతలు పూర్తవుతాయని, వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు మోహన్, శంకర్ అప్పా, మాధవ్‌రావు తదితరులు కోరారు.

కేంద్ర ప్రభుత్వం రైతులపై పోలీస్ కాల్పులను విరమించాలి

నవతెలంగాణ-రెంజల్

కేంద్ర ప్రభుత్వం రైతులపై పోలీస్ కాల్పులను వెంటనే ఆపాలని, స్వామినాథన్ కమిషన్ అమలు చేయాలని, రైతు సమగ్ర చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేస్తూ తాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నసీర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులపై దమన కాండను వెంటనే నిలిపివేయాలని, రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను వెంటనే తొలగించాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధ పోశెట్టి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- డాక్టర్ వినయ్ కుమార్

నవతెలంగాణ-రెంజల్

నిండు జీవితానికి రెండు చు క్కలు అనే నినాదంతో పల్స్ పోలి యో కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ వినయ్ కుమార్ తెలిపారు. గురు వారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేం ద్రంలో వైద్య సిబ్బందితో ప్రత్యేక స మావేశాన్ని నిర్వహించారు. మార్చి 3 నుంచి 5 వరకు నిర్వహించే ప ల్స్ పోలియో కార్యక్రమాన్ని ఘనం గా నిర్వహించాలన్నారు. మండలం లో ఐదేండ్లలోపు పిల్లలు 4650 మ ంది ఉన్నారని, వారికి మండలంలో 25 పోలింగ్ కేంద్రాలతో పాటు మొబైల్ టీమ్‌లు ఏర్పాటు చేయను న్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్య క్రమంలో డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ సహిస్తా పిర్దోస్, డాక్టర్ ప్ర మోదిత, డాక్టర్ ఉజ్మ, ఆరోగ్య విస్తీర్ణ అధికారులు కరిపే రవీందర్, శ్రా వణ్ కుమార్, పబ్లిక్ స్టాఫ్‌నర్సు రా ణి, హెమ్యాచ్ హెల్ప్ ఇస్ లక్ష్మీనా రాయణ, ఇర్ఫాన్, ఆరోగ్య కార్యకర్త లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జీవనోపాధి పెంచుకోవాలి

• డీఆర్డీఓ సాయాగౌడ్



నవతెలంగాణ-డిచ్‌పల్లి

జీవనోపాదులు పెంచుకోనే విధంగా మహిళలు ప్రత్యేకంగా కృషి చేయాలని డిఆర్డిఓ సాయగౌడ్ అన్నారు. గురువారం డిచ్ పల్లి మండల కేంద్రంలోని ట్రైజం సెంటర్ లో స్త్రీనిధి రుణాలు ఇతర అంశాలపై సమావేశం నిర్వహించారు. స్త్రీనిధి జిల్లా స్థాయి కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా డిఆర్డిఓ సాయాగౌడ్ పాల్గొని మాట్లాడుతూ.. ఈ అర్థిక సంవత్సరాంలో స్త్రీనిధి రుణాల పంపిణి, 100శాతం మేరకు వచ్చే రుణాలను రికవరీ చేయాలని సూచించారు. అదే విధంగా రాష్ట్రం లోని అన్ని కార్యక్రమాల్లో ముందంజలో ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమం లో డీపీఎం ఐబి శ్రీనివాస్,ఎస్ ఎన్ మేనేజర్, జిల్లా అకౌంటెంట్ నాగమణి స్త్రీనిధి సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ మంత్రి కూతురు పెళ్లికి హాజరైన రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

నవతెలంగాణ-మోపాల్



హైదరాబాదులో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో గురువారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారి కుమార్తె వివాహ వేడుకల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతోపాటు మాజీ డీసీఎంఎస్ చైర్మన్ మునిపల్లి సాయి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకోసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు

నవతెలంగాణ-ముప్కాల్

విద్యార్థుల భవిష్యత్ కోసం కెరియర్ గైడెన్స్ కోసం విద్యాశాఖ ఉన్నతాధికారులు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఈ టోల్ ఫ్రీ నంబర్ 18004252428 వారి కెరియర్ గైడెన్స్, కెరియర్ ఎంపిక, పలు రకాల ప్రవేశ పరీక్షల వివరాలు తెలుసుకునేలా ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులకు సంబంధించిన సందేహాలను సైతం నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఆడపిల్లల సంరక్షణ, చట్టాలపై అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, తదితరులు

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండలంలోని అంక్సాపూర్ రైతువేదికలో మహిళా శిశు సంక్షేమ వయోవృద్దుల శాఖ, ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్రం నుండి భేటీ బచావో భేటీ పడావోపై అంగన్వాడీ కార్యకర్తలకు, ఆశలకు వివో అధ్యక్షులకు గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ డి డబ్ల్యూ ఓ రసూల్ బీ ముఖ్య అతిధిగా విచ్చేసి ఆడపిల్లల సంరక్షణ, చట్టాలపై అవగాహన కల్పించారు. అనిమియా గురించి చైల్డ్ మ్యారేజెస్ స్కూల్ డ్రాపౌట్స్ గురించి హెల్ప్‌లైన్‌ల గురించి వివరించారు, . కార్యక్రమంలో సీడీపీఓ జ్ఞానేశ్వరి, ది న్యూ ఇండియా అషురెన్స్ కంపెని నుండి డివిజనల్ మేనేజర్ శ్యామసుందరి, హై స్కూలు హెడ్ మాస్టల్, ప్రైమరి స్కూల్ హెడ్ మాస్టర్, పోషణభియాన్ క్డొనేటర్ రాంబాబు, మహిళా సాధికారత కేంద్రం యొక్క జెండర్ స్పెషలిస్ట్ కవిత, సౌమ్య , ఎస్ఎఫ్ఎల్ పుష్ప తదితరులు పాల్గొనటం జరిగింది.

ఈవ్‌టీజింగ్ చేస్తే షీటీంకు సమాచారమివ్వాలి

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

ఇవ్ టీజింగ్ చేస్తే షీ టీంకు సమాచారం ఇవ్వాల నీ ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, ఈవ్ టీజింగ్ చేసిన షీ టీంకు సమాచారం ఇవ్వాలని సబ్ డివిజన్ షీ టీం కానిస్టేబుళ్ల, విగ్నేష్, సుమతి అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోతేలో గురువారం సైబర్ క్రైమ్ గురించి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు, ఉద్యోగులు, మహిళలు ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన షీ టీంకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈవ్ టీజింగ్‌కు గురయ్యేవారు భయపడకుండా సమాచారం ఇస్తే రక్షణ కల్పిస్తామన్నారు. షీ టీం నెంబర్ 8712659795కు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా షీ టీం వారికి ఫిర్యాదు చేసే విధానాన్ని మహిళలకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వైద్య గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలంగాణ యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న నూతన కార్యవర్గ సభ్యులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా జనరల్ బాడి, జిల్లాలో మండలాలో పాస్టర్స్ అసోసియేషన్ నుండి అధ్యక్షులు, కార్యదర్శులు, సీనియర్ నాయకులు, ఏబీసీ వారు కలసి 2024-2025 గాను జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కమిటీ అధ్యక్షులుగా రెవ వి. జెకర్యా అనంద్, ప్రధాన కార్యదర్శిగా రెవ సిహెచ్. డేనియల్, కార్యనిర్వహణ అధ్యక్షులుగా రెవ పి.శామ్యూల్, అసోసియేట్ అధ్యక్షులుగా రెవ జి. ఎలిషా, రెవ సిహెచ్. ఇస్రాయెల్, కోశాధికారిగా రెవ సిహెచ్. జాన్ బన్యన్, ఉపాధ్యక్షులుగా రెవ జి.అమోస్, రెవ కె. హనోక్, శ్రీనివాస్ ప్రలియ. పాస్టర్ మాణిక్యాల శ్రీసు, రెవ విన్సెంట్, అనంద్ పాల్, అబ్రహం, అనంతరావు, ఉప కార్యదర్శులుగా పాస్టర్ సువార్తరాజు, రెవ సుధీర్, పాస్టర్ రవీందర్, పబ్లిసిటీ సెక్రెటరీగా పాస్టర్ కరుణాకర్, పాస్టర్ రవి అనంద్, పాస్టర్ దినకర్, పాస్టర్ రాజు, సిస్టర్ రేచల్ సజిని, అర్గనైజిగ్ సెక్రెటరీగా, ఉమెన్స్ సెక్రెటరీ గాసిస్టర్ షారోన్ రాణి, మాజీ అధ్యక్షులు అందరూ చీఫ్ అడ్వజర్స్‌గా ఎన్నుకున్నారని తెలిపారు.

ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందేలా చూడాలి

• ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందేలా చూడాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. పట్టణంలోని పెర్కిట్ కేజీబీవీ పాఠశాలలో గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి గంగామణితో పాఠశాల స్థితిగతులు, సౌకర్యాలు సమస్యలు, పరిశుభ్రత తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, బిజెపి నాయకులు కలిగొట గంగాధర్, ఆకుల శ్రీనివాస్, మందుల బాలు, కొట్టాల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు నెలలుగా జీతాల్లేవ్?



• ఇబ్బందుల్లో 104 ఉద్యోగులు
• నెలనెలా చెల్లించాలని వేడుకోలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

104 వాహనంలో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు సక్రమంగా వేతనాలు చెల్లించి, ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని 104 ఉద్యోగులు కోరుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువయ్యేవిధంగా ఉపయోగంగా ఉండాలనే సదుద్దేశంతో 104 వైద్య సేవలను ప్రారంభించారు. అందులో ఒక వాహనానికి ఒక ఫార్మసిస్ట్, ఒక లాబ్ టెక్నీషియన్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక డ్రైవర్‌ని ఔట్సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగులను నియమించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుండి 2022 వరకు విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత 2022లో వాహనాల ద్వారా అందించే వైద్య సేవలను ప్రభుత్వం మూసివేసి, 104 వాహనంలో పనిచేస్తున్న 50 మంది ఉద్యోగస్తులను పిహెచ్సి, యుపిహెచ్సి సెంటర్లకు సర్దుబాటు చేసి వేతనాలు చెల్లించారు. నిజామాబాద్ జిల్లాకు 104 వాహనాలు 8 ఉండేవి అందులో పనిచేస్తున్న ఫార్మాసిస్ట్, లాబ్ టెక్నీషియన్, డేటా ఆపరేటర్, డ్రైవర్లకు జిల్లాలోని అవసరమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్సి), అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యుపిహెచ్సి) లలో సర్దుబాటు చేయడంతో పాటు ఫార్మసిస్ట్, లాబ్ టెక్నీషియన్‌కు రూ. 22,750, డ్రైవర్, డాటా ఎంట్రీ ఆపరేటర్ కు రూ.19,500 వేతనం ఇస్తున్నారు. అదికూడా నెలనెల సక్రమంగా చెల్లించడంలేదు. ప్రస్తుతం వారికి నెలనెలా వేతనాలు సక్రమంగా రావడం లేదని, గత 5 నెలల నుండి వేతనాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబ పోషణ ఇబ్బందిగా మారుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వేతనాలు నెలనెలా చెల్లించేలా చూడాలి

- రాజేష్, 104 ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు

వేతనాలను సక్రమంగా చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా ఔట్సోర్సింగ్ పద్ధతిని కాకుండా కాంట్రాక్ట్ పద్ధతిలో అయినా రెగ్యులర్ పద్ధతిలో అయినా ఉద్యోగులుగా గుర్తించి విధంగా చర్యలు తీసుకోని 104 ఉద్యోగులకు భరోసా కల్పించాలి. 5 నెలలు గా వేతనాలు లేక ఇబ్బంది ఎదురుకుంటున్నాం.

కేంద్ర మంత్రి గడ్కరీకి స్వాగతం పలికిన కలెక్టర్, సీపీ

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ పర్యటనకు విచ్చేసిన కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా మంత్రి గురువారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (న్యూ కలెక్టరేట్)కు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఎఫ్ఓ వికాస్ మీనా, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి బొకేలు అందించి సాదర స్వాగతం పలికారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ప్రత్యేక కాన్వాయ్ లో కేంద్ర మంత్రి పాత కలెక్టరేట్ మైదానంలో జరిగే సభకు వెళ్లారు.


కేంద్ర మంత్రికి బొకేను అందజేస్తున్న కలెక్టర్, సీపీ

మంత్రికీ భగవద్గీత అందజేత

విజయ సంకల్ప సభ ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా కేంద్ర జాతీయ రహదారుల జల వనరుల శాఖ మంత్రి నితిన్ ఘడ్కరి కి ఓబీసీ మోర్చ అధికార ప్రతినిధి మదాసు స్వామి యాదవ్ భగవద్గీత అందజేశారు. హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం పలికి శాలువా కప్పి సత్కరించారు

ప్రభుత్వం వెంటనే చక్కెర ఫ్యాక్టరీలు తెరిపించి నడిపించాలి

ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య


మాట్లాడుతున్న వేల్పూర్ భూమయ్య

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జిల్లాలో గల చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించాలని, ఎన్సిఎస్ఎఫ్ సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీని సబ్ కమిటీలో చేర్చి తెరిపించి నడిపించాలని ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం డిచ్ పల్లి మండల కేంద్రంలో ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తామని ఇచ్చిన హామీ మేరకు నిజాం షుగర్ ఫ్యాక్టరీలపై పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు నాయకత్వంలో సబ్ కమిటీ వేశారని ,దానిని మేము స్వాగిస్తున్నామని అన్నారు. ఇదే సందర్భంలో సబ్ కమిటీలో ఎన్సిఎస్ఎఫ్ ఫ్యాక్టరీ లేకపోవడాన్ని విబేధిస్తున్నామన్నారు. ఎన్సిఎస్ఎఫ్ సారంగాపూర్ కూడా ఈ ప్రాంత రైతులు కూడా తెలంగాణలో భాగమేనని తెలిపారు. దీనిని కూడా సబ్ కమిటీల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్సిఎస్ఎఫ్ సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీ 1962 సంవత్సరంలో 23 వేలమంది రైతులు సభ్యులుగా 290 కోట్ల మూలధనంతో 99 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పడిందని తెలిపారు. నాలుగు నియోజకవర్గాల పరిధిలో వేలాదిమంది కార్మికులు, వ్యవసాయ కూలీలతో కుటుంబాలతో 5000 మంది రైతు కుటుంబాలతో వెలుగు నింపిందన్నారు. గత పాలకులు తప్పుడు విధానాలు, అవినీతి అధికారుల మూలంగా లాభాల బాటలో ఉన్న ఈ ఫ్యాక్టరీ 2008లో మూతపడిందని తెలిపారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంద రోజుల్లో తెరిపిస్తామని రైతులకు హామీ ఇచ్చి మోసం చేసిందని వాపోయారు. అందుకే రైతులు వారిని పక్కన పెట్టి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారని అన్నారు. ఈ చక్కెర ఫ్యాక్టరీలను ప్రభుత్వమే తెరిపించి నడిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలి సంఘం నాయకులు సాయిరెడ్డి, దేవస్వామి, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాలను సందర్శించిన అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభం అయ్యాయి. జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ నిజామాబాద్ పట్టణంలోని నిర్మల హృదయ జూనియర్ కళాశాల, సిఎస్ఐ జూనియర్ కళాశాలలను సందర్శించారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ మాక్లూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, దాస్ నగర్ లోని మహాత్మా జ్యోతిబా పులే బీసీ జూనియర్ కళాశాల, ఉమెన్స్ జూనియర్ కళాశాల లను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్ బోధన్ లోని మధు మలంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, మరో 4 ప్రైవేట్ కళాశాలలను తనిఖీ చేశారు. అలాగే హై పవర్ కమిటి డాక్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో 5 కళాశాలలను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రజియుద్దీన్ అస్లామ్, దేవరాం 10 కళాశాలలను తనిఖీ చేశారు. ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు 28 కళాశాలలను తనిఖీలు నిర్వహించారు. మొత్తం 16,961 మంది రెండవ సంవత్సరం విద్యార్థులకు గాను 723 మంది గైర్హాజరు కాగా 16,238 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అయ్యారు. జిల్లా ఇంటర్ విద్యా అధికారి మాట్లాడుతూ ఇంటర్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షల నిర్వహణ కమిటీ, హై పవర్ కమిటీ ఆధ్వర్యంలో సమన్వయం చేస్తున్నామన్నారు.

హంసవాహిని పాఠశాలలో సైన్స్ ఫెయిర్

• ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ బీ సంపత్ కుమార్

నవతెలంగాణ-ధర్పల్లి



మండల కేంద్రంలో హంసవాహిని పాఠశాలలో గురువారం సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ సంపత్ కుమార్ పాల్గొని విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల సైన్స్ పరికరాలను పరిశీలించారు. వాటి పనితీరు వాటిని తయారీ చేసే విధానాలను విద్యార్థులు వివరించారు. సుమారు 20 రకాల అంశాలపై విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈసందర్భంగా ప్రొఫెసర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్ ద్వారా వారికున్న మేధస్సును పరీక్షించుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. ప్రతి విద్యార్థిలో ఏదోఒక ప్రతిభ దాగి ఉంటుందని, వాటిని వెలికి తీసే ప్రయత్నమే ఈ సైన్స్ ఫెయిర్ ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రాంబాబు, ప్రధానోపాధ్యా యులు శ్రీనివాస చక్రవర్తి, డైరెక్టర్లు మాన్సింగ్, రాజేశ్వర్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, రామ కృష్ణ, నవీన్, విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

టీఎస్ ఆర్టీసీ ఏడిసికి ఘనంగా వీడ్కోలు

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ టీఎస్ ఆర్టీసీ డిపోలో ఏడీసిగా విధులు నిర్వహిస్తున్న పడిగెల గంగాధర్ 36 వసంతాలు ఆర్టీసీ డిపోలో కండక్టర్ గా అరంగేట్రం చేసి పదోన్నతులతో ఏడీసిగా పదోన్నతి పొంది గురువారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసీ సంస్థకు కార్మికులకు చేసిన సేవలు అభినందించారు. కార్మిక నాయకుడిగా అపరిష్కృత సమస్యలను పరిష్కరించి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవిలో కొనసాగి ప్రభుత్వాన్ని మెప్పించి ఒప్పించి కార్మికుల సమస్యలను తీర్చిన సేవల్ని కొనియాడారు. ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మురళి,ఆర్టీసీ కండక్టర్లు డ్రైవర్లు,సిబ్బంది, రిటైర్డ్ కండక్టర్లు డ్రైవర్లు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ క్యారం అసోసియేషన్ అధ్యక్షుడిగా క్యాతం సంతోష్ కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్



తెలంగాణ క్యారం అసోసియేషన్ అధ్యక్షుడిగా క్యాతం సంతోష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల హైదరాబాదులోని లాల్ బహదూర్ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ క్యారం అసోసియేషన్ ఎన్నికల్లో జిల్లా క్యారం అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న సంతోష్ కుమార్ తెలంగాణ రాష్ట్ర క్యారం అధ్యక్షునిగా, కార్యదర్శిగా మదన్ రాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంతోష్ కుమార్ నగరంలోని నవ్య భారతి గ్లోబల్ పాఠశాల చైర్మెన్. గత 53 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర క్యారమ్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఉన్న బి కే హరినాథ్ నుండి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర బాధ్యులు అధ్యక్షునిగా తనపై ఉంచిన నమ్మకాన్ని సక్రమంగా నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు. జిల్లా, తెలంగాణ రాష్ట్ర క్యారం క్రీడాకారుల క్రీడాభివృద్ధికి తోడ్పడుతానని తెలిపారు. క్యారంలో క్రీడాకారులు రాణించే విధంగా గ్రాస్ రూట్ నుండి క్రీడాకారులను ఎంపికచేసి వారిలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసే విధంగా టోర్నమెంట్లు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఎంపిక సందర్భంగా జిల్లా క్యారం అసోసియేషన్ కార్యదర్శి భూమారెడ్డి, ఒలంపిక్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఈగ సంజీవరెడ్డి, బొబ్బిలి నర్సయ్య, జిల్లా కమిటీ సంఘం ప్రధాన కార్యదర్శి అంధ్యల లింగయ్య, సాయగౌడ్ సుబ్బారావు, జిల్లా పేటా సంఘం అధ్యక్ష కార్యదర్శులు విద్యాసాగర్ రెడ్డి, మల్లేష్‌గౌడ్ టిజి పేట అధ్యక్షులు గోపిరెడ్డి, నిజామాబాద్ అర్బన్ ప్రైవేట్ పిఈటి అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అజ్మత్ ఖాన్, మీసాల ప్రశాంత్, ఇతర సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

నాలుగు ఉద్యోగాలకు ఎంపిక

• గోవింద్‌పేట్ యువకుడి ఘనత

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అని ఓ యువకుడు నిరూపించాడు. మండలంలోని గోవింద్ పేట్ గ్రామానికి చెందిన ఒక సామాన్యమైన కుటుంబం కటిక పేదరికాన్ని చూసిన తల్లిదండ్రులు ఇద్దరు కొడుకులను ఉన్నత స్థానంలో చూడాలని వారు కష్టపడి కుమారులను ఉన్నత చదువులు చదివించారు. హాస్టల్లో ఉంటూ కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించారు. గ్రామానికి చెందిన సిరిపురం చిన్న సాయన్న, తల్లి లక్ష్మి, వీరికి ఇద్దరు కుమారులు. చిన్ననాటి నుండి గోవింద్‌పేట్ గ్రామంలో జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుకున్నారు. ఇంటర్ ఆర్మూర్ ప్రభుత్వ కాలేజీలో చేరి డిగ్రీ ఎస్ఎస్ఆర్ కాలేజీ నిజామాబాద్. లో పూర్తిచేసి ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో చేరి పీజీ, పీహెచ్‌డి చేసి నాలుగు ఉద్యోగాలను సంపాదించాడు. ఒకటి డిగ్రీ లెక్చరర్, రెండవది జూనియర్ కాలేజ్ లెక్చరర్, మూడవది పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్, ప్రస్తుతం సురేందర్ తెలంగాణ గురుకుల లెక్చరర్‌గా ఉద్యోగానికి ఎన్నికై విధుల్లో చేరనున్నారు. హైదరాబాదులో చదువుతూనే పేపర్ బాయ్‌గా క్యాటరింగ్ పనులకు వెళ్లి వచ్చిన డబ్బులతో చదువుకు సంబంధించిన బుక్స్‌ను కొనుగోలు చేసుకుని కష్టపడి చదివి ఈ ఉద్యోగాలను సాధించాడు. గ్రామానికి వస్తే వ్యవసాయ పనులు కూలి పనులు చేసి తల్లిదండ్రులకు సహాయపడేవాడు. అలా కష్టాల నుండి పైకి వచ్చి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అందుకున్నాడు సిరిపురం సురేందర్.

సురేందర్ అన్న సైతం...

సురేందర్ అన్న నరేందర్ కూడా కష్టపడి చదివి ప్రస్తుతం డిచ్ పల్లి లోని ఏడవ బెటాలియన్‌లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా-2018 బ్యాచ్)విధులు నిర్వహిస్తున్నాడు. ఇలాంటి ఆణిముత్యాలను కన్న తల్లిదండ్రులకు వారి కుమారులను గోవింద్‌పేట్ గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ మాజీ సర్పంచ్ బండమీది జమున గంగాధర్, సొసైటీ చైర్మన్ బంటు మహిపాల్ తదితరులు వీరిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

స్త్రీనిధి లక్ష్యాన్ని పూర్తి చేయాలి

నవతెలంగాణ-మోపాల్

స్త్రీనిధి లక్ష్యాన్ని కూడా మార్చి 15వ వరకు చేరుకోవాలని నిర్ణయించుకున్నారు. మండల కేంద్రంలో మహిళా సమాఖ్య ఈసీ సభ్యుల సమావేశం గురువారం ఏర్పాటు చేశారు. బ్యాంక్ లింకేజీ లక్ష్యం 37.55 కోట్లు ఉండగా మార్చి నెల నాటికి 35 కోట్ల వరకు రికవరీ సాధ్యమైందని అన్నారు. ఇంకా 2.55 కోట్ల లక్ష్యాన్ని 15 రోజుల్లో పూర్తి చేసుకోవాలని నిర్దేశించుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం మోహన్, 29 గ్రామ సంఘాల ప్రతినిధులు, పాలకవర్గ సీసీలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఈసీ సభ్యులు

పారిశుధ్య పనులు పరిశీలన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలకేంద్రంలో పారిశుధ్య పనులను స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మానందం గురువారం పరిశీలించారు. మండల కేంద్రంలో పలు వీధుల్లో డ్రైనేజీ పనుల ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి వీధిలో పరిశుభ్రం గా ఉంచాలని పారిశుధ్య కార్మికులకు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్

పాల్స్ పోలియోను విజయవంతం చేయాలి

- వైద్యాధికారి సంతోష్ కుమార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మార్చి మూడవ తేదీ ఆదివారం రోజున పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఇందల్ వాయి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సంతోష్ కుమార్ అన్నారు. గురువారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలకు పల్స్ పోలియోపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యదికారి సంతోష్ కుమార్ మాట్లాడుతూ మార్చి మూడవ తేదీ ఆదివారం రోజున పల్స్ పోలియో కార్యక్రమం ఉన్నందున ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని వినియోగించు కోవాలని కోరారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలకు పల్స్ పోలియో పై అవగాహన కల్గి ఉండాలని సూచించారు. ఇందల్ వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 0 -5 సంవత్సరముల వయస్సు గల పిల్లలు 7322 మంది ఉన్నారని వారందరినీ ఖచ్చితంగా నూటికి నూరు శాతం లక్ష్యాన్ని చేర్చుకోవాలని తెలిపారు. మార్చి4, 5 న ఇంటింటికి తిరిగి తప్పిపోయిన పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్క ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ కచ్చితంగా పోలియో చుక్కలు వేయాలని ఎవరు తప్పిపోవడానికి వీలులేదని, హైరిస్క్ ఏరియా అయినటువంటి ఇటుక బట్టీలలో పనిచేసేవారు, లేదా భవన నిర్మాణ కార్మికులు, లేదా సంచార జాతరలో ఉన్నటువంటి చిన్న పిల్లలకు ఖచ్చితంగా పోలియో చుక్కలు వేయాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొత్తం 61 బూతులను బూతుల్లో పోలియో చుక్కలు వేయడానికి ఏర్పాటుచేశామన్నారు. ప్రతి ఆశా కార్యకర్త ఈ రెండు రోజులలో ఇంటింటికి తిరిగి ప్రజల్లో అవగాహన పెంచాలని ప్రతి గ్రామంలో మసీదులు, చర్చిలు దేవాలయాల్లో మైకులలో ద్వారా చాటింపు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, ఉమారాణి, ఆరోగ్య కార్యకర్తలు వెంకట్ రెడ్డి ,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి సంతోష్ కుమార్

రెవెన్యూ డివిజన్ అధికారి బదిలీ

నవతెలంగాణ-ఆర్మూర్

రెవెన్యూ డివిజన్ అధికారిగా పనిచేసిన టి.వినోద్ కుమార్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బోధన్ ఆర్డీవోగా పనిచేసిన రాజా గౌడ్ బదిలీపై రానున్నారు. కాగా బదిలీ అయిన వినోద్ కుమార్ భూపాలపల్లి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లా అండ్ ఆర్డర్‌గా బదిలీపై వెళ్లారు.

ఇద్దరు గైర్హాజరు

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు చీఫ్ సుపరిండెంట్ డి. శివకుమార్ గురువారం తెలిపారు. ఇంటర్ రెండవ సంవత్సరం తెలుగు, హిందీ, సంస్కృత్ అరబిక్, పరీక్షలకు మొత్తం 192 మంది పరీక్షలు రాయవాల్సి ఉండగా 190మంది విద్యార్థులు వ్రాసారని, ఒకేషనల్ పరీక్షకు 16 మందికి 16 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని డిఐఈఓ రఘురాజ్, డిఇసి- రోజిఉద్దిన్, తహాశీల్దార్ షబ్బీర్, ఫ్లయింగ్ స్క్వాడ్ నర్సయ్య పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.

శ్రీ చైతన్య స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్



సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మేయర్

నవతెలంగాణ-నిజామాబాద్

సైన్స్ దినోత్సవం సందర్భంగా శ్రీచైతన్య నిజామాబాద్-1 బ్రాంచ్ ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శన పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈసందర్భంగా నిజామాబాద్ మేయర్ నీతూ కిరణ్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో వ్యర్థమైన సౌరశక్తి, జలవిద్యుత్ ప్లాంట్, గ్లోబల్ వార్మింగ్ 85కి పైగా వర్కింగ్ మోడల్ స్టాల్స్ ఏర్పాటుచేశారు. డాక్టర్ హరీష్ స్వామి , డా పి సాంబశివ, డాక్టర్ ఎం.ఆనంద్ కుమార్ ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేశారు. 500 మందికి పైగా ఈ కార్యక్రమాన్ని సందర్శించారు. విజేతలను నిజామాబాద్ జోన్ ఏజీఎం జితేందర్, జోనల్ కోఆర్డినేటర్ ఎం.నరేంద్ర, ప్రిన్సిపాల్ ఎం. బాకర్ హుస్సేన్ పాఠశాల సిబ్బంది బహుమతులతో అభినందించారు.

కంది పంట పరిశీలన



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని లింబూర్ గ్రామంలో రైతు పురుషోత్తం పటేల్ సాగుచేస్తున్న కంది పంటను మండల వ్యవసాయ అధికారి రాజు గురువారం పరిశీలించారు. ముఖ్యంగా యాసంగిలో కంది వేయడం వల్ల రైతులు తక్కువ పెట్టుబడితో లాభం పొందవచ్చునని తెలిపారు. వానాకాలం కంటే యాసంగిలో కంది పంట కాలం తగ్గి త్వరగా కోతకు వస్తుందని వివరించారు. ప్రస్తుతం పంట పూత, కాయ దశలో ఉన్నట్లు తెలిపారు. ఈ నెలలో పంట కోతకు వస్తుందని, ఎకరానికి 5 క్వింటాళ్ల నుంచి 7 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశాలుంటాయని పేర్కొన్నారు. పంట పరిశీలనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏవో రాజు రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ నాందేవ్, రైతు పురుషోత్తం పటేల్ పాల్గొన్నారు.

హెూరాహెూరీగా క్రికెట్ మెన్ టోర్నమెంట్స్



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ క్రికెట్ మెన్ టోర్నమెంట్ హెూరా హెూరీగా కొనసాగుతుంది.నాల్గవ రోజు మొదటి మ్యాచ్ వర్సిటీ పిజి టిమ్‌తో తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ టీం తలపడగ 12 ఓవర్లలో 104 పరుగులు సాధించి వర్సిటీ పిజి టీం గెలుపొందింది. రెండవ మ్యాచ్ మొదటి సెమీ ఫైనల్ గిరిరాజ్ డిగ్రీ కళాశాల కేర్ డిగ్రీ కళాశాల తలపడగా 15 ఓవర్ల లో 145 పరుగులు సాధించి గిరిరాజ్ డిగ్రీ కళాశాల గెలుపొంది ఫైనల్స్ కు చేరుకుందని వర్సిటీ డైరెక్టర్ స్పోర్ట్స్ డాక్టర్. జి. బాలకిషన్ తెలిపారు.ఈ టోర్నమెంట్ లో ఆర్గనైసింగ్ సెక్రటరీ డాక్టర్. బి. ఆర్. నేత, జూనియర్ అసిస్టెంట్ నరేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిని సత్కరించిన మాజీ సర్పంచ్




సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ని బషీరాబాద్ మాజీ సర్పంచ్ సక్కారం అశోక్ శాలువాతో సత్కరించారు. గురువారం గ్రామంలో పలుశుభకార్యాలలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి బషీరాబాద్ విచ్చేశారు. బాల్కొండ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించిన తరువాత మొదటి సారి గ్రామానికి వచ్చిన సందర్భంగా ప్రశాంత్ రెడ్డికి మాజీ సర్పంచ్ సక్కారం అశోక్ తన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రశాంత్ రెడ్డిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బైకాని మహేష్, నాయకులు తోట అప్పయ్య, సత్యం, ప్రశాంత్, నరసయ్య రవి, మురళి, గొల్ల సాయన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



పంటను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని సాలూరక్యాంప్, జాడిజమాల్‌పూర్ శివారులో పంట పొలాలను ఇరిగేషన్ ఈఈ రాజశేఖర్ గురువారం పరిశీలించారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదలైన ఐదో విడత నీటి సరఫరా ఎంతవరకు రైతుల పంట పొలాలకు చేరిందోనని ఆయన పరిశీలించారు. ఫిబ్రవరి 20వ తేదీన విడుదలైన ఐదో విడత నీటి సరఫరా మార్చి 1న ముగుస్తుందని పేర్కొన్నారు. దాంతో ఈ ఐదు విడతలలో రైతులకు ఎంతవరకు సాగునీరు అందిందని ఆయన రైతులను అడిగి తెలుసుకున్నారు. మరో 10 రోజుల్లో ఆరో విడత సాగునీటిని విడుదల చేస్తామని ఆయన తెలిపారు. రైతులు నిజాంసాగర్ నీటిని దుర్వినియోగం కాకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం డీ-28 కెనాల్ నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఇరిగేషన్ ఏఈ శృతి, రైతులు, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు ఉన్నారు.

హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరణ

- నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలింపు
- కేసు వివరాలు వెల్లడించిన సీఐ

నవతెలంగాణ-బాల్కొండ

మండల పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన ధర్మాయి లావణ్య అనుమానాస్పద మృతి కేసును చేధించినట్లు సీఐ కే.శ్రీధర్ రెడ్డి తెలిపారు. బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో కేసు వివరాలను వెల్లడించారు.

ఈ కేసు విషయంలో మృతురాలి భర్త ధర్మాయి రాజేందర్‌ను అరెస్టుచేసి విచారించగా తన భార్యను తానే చంపానని నేరం ఒప్పుకున్నాడన్నారు. ఇద్దరి మధ్యన కోర్టులో ఉన్న కేసుల విషయంలో గొడవ జరిగి మాటా మాట పెరిగి ధర్మాయి లావణ్యను తనభర్త రాజేందర్ టవల్‌తో లావణ్య మెడను గట్టిగా బిగించి హత్య చేశాడు. అనంతరం శవాన్ని అదే ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు వేలాడదీసి ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ప్రయత్నం చేశాడు. ఈ కేసు విషయంలో బుధవారం నలుగురిని అదుపులోకి తీసుకొని విచారించగా రాజేందర్ తన భార్యను తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని సీఐ తెలిపారు. ధర్మయి రాజేందర్‌ను, మృతురాలు బతికి ఉన్నప్పుడు శారీరకంగా మానసికంగా చిత్రహింసలకు గురిచేసిన అత్త మామ చనిపోవాల్సిందిగా ఆమెను బలవంత పెట్టాడు. ఆమెతో సూసైడ్ నోట్ రాయించాడు. తర్వాత ధర్మాయి రాజేందర్ ఆడపడుచులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.



మాట్లాడుతున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

ప్రతి మహిళను లక్షాధికారి చేయడమే ధ్యేయం

- డీఆర్డిఓ పిడి సాయాగౌడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్రంలో మహిళ సంఘాల్లో ఉన్న మహిళను లక్షాధికారి చేయడానికి వారికి సరియైన జీవనోపాదులు కల్పించి ఆర్థికంగా సహాయం చేయాలని నిజామాబాద్ డిఆర్డిఓ డిఆర్డీఏ పీడీ సాయాగౌడ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో డిచ్‌పల్లి, ఇందల్ వాయి మండలాల వీఓఏ, సీసిలకు రెండు రోజులపాటు లక్‌పతి దీదిపై శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షాధికారి చేయడానికి సభ్యురాలి వారిగా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. మహిళ సభ్యులకు ప్రభుత్వం ద్వారా కల్పించే పథకాలను అందరికి అందించాలని బ్యాంకు లింకేజీ, స్త్రీధి రుణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపిడిఓ రవీందర్, డిపిఎం సాయిలు, ఏపిఎంలు గంగాధర్, సువర్ణ, రజీత, రాజేందర్, రెండు మండలాల వీఓఏలు, సిసిలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్డిఓ పిడి సాయాగౌడ్

పదిలో వందశాతం ఉత్తీర్ణత తీసుకురావాలి

- జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకొని రానున్న పదవ తరగతి పరీక్షలలో మంచి మార్కులు సాధించి వందశాతం ఉత్తీర్ణత తీసుకురావాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామ సమీపంలోని గురుకుల పాఠశాలను పరిశీలించి పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలని, కష్టపడి చదువుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ స్టేట్ జనరల్ సెక్రెటరీ శంకర్, కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు అభయ హస్తం ఫౌండేషన్ సభ్యులు బర్ల మధు తదితరులు దుస్తులను గురువారం పంపిణీ చేశారు. విద్యార్థులు పదవ తరగతి పరీక్షలలో మంచి మార్కులు సాధించి పాఠశాల పేరు నిలపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, మాజీ జెడ్పిటిసి శంకర్, ఎంపీటీసీ సలీం తదితరులు పాల్గొన్నారు.



అభయ హస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ

కాంగ్రెస్ సాలూర గ్రామ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం సాలూర గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, ఉపాధ్యక్షులుగా లోకప్పగారి లక్ష్మణ్, షేక్ వహీద్, ప్రధాన కార్యదర్శిగా సోక్కం బ్రమ్మరెడ్డి, కార్యదర్శిగా మద్దెల సాయిలు, కోశాధికారిగా నీరడి నగేష్, కార్యవర్గ సభ్యులుగా హెూట్లప్ప, మోనేగారి చిన్న రాజు, మైదాపు రాజు, చాకలి లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు. ముఖ్యసలహాదారులుగా ఇల్తేపు శారదా శంకర్, అల్లే రమేష్, భూయ్యన్ సురేష్, కన్నే అశోక్, లక్ష్మణ్‌గౌడ్‌ను ప్రకటించారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, బోధన్ మండలాధ్యక్షులు నాగేశ్వర్‌రావు, సాలురా మండల అధ్యక్షులు మందర్నా రవి, కేజీ గంగారాం, వర్కింగ్ ప్రెసిడెంట్ హన్మండ్లు, నాగరాజు, సోక్కం రవి కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శ్రీ ఖండేరాయ వేడుకలు



పూజలు చేస్తున్న పలువురు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ఉత్తునూర్ గ్రామంలోని శ్రీ ఖండేరాయ మహాదేవుని 21వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చారణాల మధ్య స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయాన్ని రంగురంగు పూలతో డెకరేషన్ చేసి అలంకరించారు. ఐదు రోజులపాటు జరిగే ఈ మహెూత్సవ వేడుకల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. విడిసి ఆధ్వర్యంలో అధికారులకు, ఉద్యోగులకు ప్రసాదం అందజేశారు. అలాగే శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆర్టీసీ ఎండి సజ్జనార్‌ను కలిసిన ఎంపిటిసి మనోహర్

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ జిల్లా డెలిగేట్ ఎంపీటీసీ కొట్టం మనోహర్ ఆర్టిసి ఎండి సజ్జనార్‌ను గురువారం కలిసి పుష్పగుచ్చం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్టీసీలో మహిళలకు ఉచితం స్పందనపై అభినందించారు.



సజ్జనార్‌ను సన్మానిస్తున్న పలువురు